జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం





## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 13 | జూన్ | 2026 ◆ పేజీలు : 8


## విద్యార్థుల స్వాగతానికి సిద్ధమైన పాఠశాలలు

- మండలంలోని అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వివరించిన విద్యాశాఖాధికారి



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 12 (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు జూన్ 15న ప్రారంభమయ్యే కొత్త విద్యాసంవత్సరానికి సిద్ధంగా ఉన్నాయని మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ తెలిపారు. శుక్రవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి మండలంలోని పాఠశాలల పునఃప్రారంభ ఏర్పాట్ల వివరాలను ఆయనకు తెలియజేశారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు,

మిగతా 2 లో...



గోదావరి అంటేనే జీవనది. కోట్లాది మందికి జీవం పోసే తల్లి. కానీ నేడు ఆ తల్లి గర్భఘోష ఎవరికీ పట్టడం లేదు. పూడికతీత పేరుతో ఇసుక తోడేళ్లు గోదారమ్మ పొట్టను ప్రొక్లైన్లతో చీలుస్తున్నారు. రాత్రి అయితే చాలు, నదీ గర్భంలో యంత్రాల హోరు. పగలంతా లారీల పరుగు. కోర్టు ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనలు, పర్యావరణం అన్నీ గాలికొదిలేశారు. "అధికారులు ఏం చేస్తున్నారు?" అని అడిగితే, "మామూళ్ల మత్తులో జోగుతున్నారు" అని గోదావరి తీరం గొల్లుమంటోంది. ఇసుకాసురుల అక్రమ దందాకు తెర పడేదెన్నడు? వారి వెనక ఉన్న తోడు నీడ ఎవరు? జర దేఖో కలెక్టర్ సాబ్... అంటూ గోదారమ్మ బిడ్డలు నిలదీస్తున్నారు.

5 లో..

● మణుగూరు, ప్రజాజ్యోతి

# గోదారమ్మ... గర్భఘోష

## అధికారులకు పట్టదా...!!

- ఎన్జీటీ నిషేధం నీటి మూటేనా...? కోర్టు ఆదేశాలు కాగితాలకే పరిమితమా...!
- ఇసుక తోడేళ్ల కాసులకు కక్కుర్తి పడుతున్న అధికార యంత్రాంగం
- ఇసుకాసురుల అక్రమ దందాను ఆపలేరా..?
- రాత్రి పగలు తేడా లేకుండా యంత్రాల హోరు
- ఇసుక తోడేళ్ల వెనక తోడు నీడ ఎవరు..?
- జర దేఖో కలెక్టర్ సాబ్....

## డా. యం.వి.కోటిరెడ్డి సేవలు ప్రశంసనీయం

- భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు




**భద్రాచలం టౌన్ , జూన్ 12 ప్రజా జ్యోతి** ఏజెన్సీ ప్రాంతంలో 30 ఏళ్లపాటు పేద ప్రజలకు వైద్య సేవలందించి ప్రభుత్వ వైద్యుడిగా పదవీ విరమణ చేసిన డాక్టర్ ఎంవి కోటిరెడ్డి సేవలు ఎంతో ప్రశంసనీయమని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలంలోని మారుతి నర్సింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన డాక్టర్ కోటిరెడ్డి సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని కోటిరెడ్డి సేవలను ప్రశంసించారు. పినపాక, జానంపేట, చింతూరు, భద్రాచల ప్రాంతాల్లో వైద్యసేలందిస్తూ ఆయా ప్రాంతాల్లోని పేద ప్రజల ఆధారాభిమానాలు చూరగొన్నారన్నారు. అలాగే భద్రాచలం ఏరియా ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా

మిగతా 2 లో...

## అక్రిడేషన్‌లతో ఆనందం..
## ఆత్మీయ కలయికతో ఉత్సాహం

- భద్రాచలంలో ప్రజాజ్యోతి రిపోర్టర్ల సమావేశం



**భద్రాచలం, జూన్ 12 (ప్రజా జ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజాజ్యోతి దినపత్రిక రిపోర్టర్ల ఆత్మీయ కలయిక కార్యక్రమం శుక్రవారం భద్రాచల పట్టణంలోని రెడ్డి సత్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రజా జ్యోతి ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. కార్యక్రమానికి ముందు పాత్రికేయులు భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెడ్డి సత్రంలో ఏర్పాటు చేసిన

మిగతా 2 లో...

## డా. యం.వి.కోటిరెడ్డి గారి సేవలు ప్రశంసనీయం

(మొదటి పేజీ తరువాయి...)

తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశారని, చింతూరు ఏరియా ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా చేసిన ఘనత దాయం. వి. కోటిరెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యశాఖ ఆరోగ్యశాఖ అధికారి డా డి. సైదులు, భద్రాచలం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డావై. రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ బి. సుబ్బారాజు, మారుతి నర్సింగ్ కళాశాల చైర్మన్, డా.వి. మోహన్‌రావు, జి.వి.వి. సుదర్శన్, దాజయభారతి, డాపి.రాజశేఖర్ పాల్గొన్నారు.

## అక్రిడేషన్‌లతో ఆనందం.. ఆత్మీయ కలయికతో ఉత్సాహం

(మొదటి పేజీ తరువాయి...)

ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజా జ్యోతి బ్యూరో ఇన్‌చార్జ్ భూక్యా రంజిత్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ప్రజా జ్యోతి దినపత్రిక సీఈవో భిక్షా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దినపత్రిక అభివృద్ధి, వార్తల నాణ్యత, పాత్రికేయుల బాధ్యతలు, ప్రజా సమస్యల ప్రతిబింబం, డిజిటల్ యుగంలో జర్నలిజం పాత్ర వంటి పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ఇటీవల ప్రజా జ్యోతి దినపత్రికకు కేటాయించబడిన జర్నలిస్టు అక్రిడేషన్ కార్డులను సంబంధిత ప్రతినిధులకు భిక్షా రెడ్డి, భూక్యా రంజిత్ నాయక్ సంయుక్తంగా అందజేశారు. అక్రిడేషన్ కార్డులు అందుకున్న పాత్రికేయులను వారు అభినందిస్తూ మరింత బాధ్యతాయుతంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ అప్పారావు, ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాధాకృష్ణ, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోలా కుమార్, పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్, అలాగే జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన ప్రజా జ్యోతి దినపత్రిక పాత్రికేయులు అదేవిధంగా ఇండియన్ క్రానికల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్ క్రాంతి కుమార్ దాసరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యార్థుల స్వాగతానికి సిద్ధమైన పాఠశాలలు

(మొదటి పేజీ తరువాయి...)

తరగతి గదులు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు అందించాల్సిన యూనిఫాం వస్త్రాలు ఇంకా అందలేదని, అవి కూడా త్వరలోనే చేరనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజు నుంచే మధ్యాహ్న భోజనం, రాగి జావ పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ సంస్థల సామాజిక బాధ్యత నిధుల సహకారంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాల భవనాల మరమ్మతులు, రంగులు వేయడం, ఇతర అభివృద్ధి పనులు త్వరలోనే పూర్తి చేయిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## పరస్పర చర్చలతో వివాదాలకు శాశ్వత పరిష్కారం – ఎస్సై రాజేందర్



**టేకులపల్లి, జూన్ 12, ప్రజాజ్యోతి:** జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని టేకులపల్లి ఎస్సై అలకుంట రాజేందర్ సూచించారు. కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరగాల్సిన అవసరం లేకుండా, తక్కువ సమయంలోనే సమస్యలకు పరిష్కారం లభించే వేదికగా లోక్ అదాలత్ నిలుస్తుందని ఆయన తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ, పగలు, ప్రతీకార భావాలతో కేసులను కొనసాగించడం కంటే పరస్పర చర్చలు, రాజీమార్గం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం సమాజానికి మేలు చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్ఐ యాక్ట్ కింద నమోదైన చెక్‌బౌన్స్ కేసులతో పాటు రాజీకి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల్లో ఇరువర్గాలు చర్చించి పరిష్కారానికి రావాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం వేగవంతం కావడంతో పాటు సమయం, ధనం ఆదా అవుతాయని, ఇరువర్గాల మధ్య సత్సంబంధాలు కూడా కొనసాగుతాయని ఎస్సై రాజేందర్ వివరించారు. ఇలాంటి అవకాశాలు తరచుగా లభించవని, కాబట్టి కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆశలన్నీ కొత్తగూడెం డీఎస్పీపైనే..?

- ఎన్‌సీఎస్‌టీ ఆదేశాలతో గిరిజన కుటుంబానికి న్యాయం జరుగుతుందా..?
- ఫిర్యాదుకు తగ్గట్లుగా దర్యాప్తు సాగుతుందా..?
- నాలుగు కేసుల వెనుక ఉన్న వాస్తవాలు తేలుస్తారా..?
- బినామీల హడావుడి దేని కోసం..?




**కొత్తగూడెం, జూన్ 12 (ప్రజాజ్యోతి)** స్థానిక పోలీసు వ్యవస్థపై నమ్మకం కోల్పోయిన ఓ గిరిజన కుటుంబం చివరకు జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్‌టీ)ను ఆశ్రయించాల్సి వచ్చిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం నుంచి నివేదిక కోరిన నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి కొత్తగూడెం డివిజన్ పోలీసు శాఖ వైఖరిపైనే కేంద్రీకృతమైంది. లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం గ్రామానికి చెందిన వజ్జ పాపమ్మ కుటుంబం ఆరోపణల ప్రకారం గత నాలుగు సంవత్సరాలుగా ఒకే భూమి వివాదానికి సంబంధించి తమపై వరుసగా నాలుగు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. సర్వే నెంబర్ 53/1 వ్యవసాయ భూమికి సంబంధించి కొంతమంది వ్యక్తులు తమ ఫిర్యాదుల్లో పేర్కొన్న వివరాల ప్రకారం ప్లాట్ నెంబర్లు 5, 11, 4, 6 స్థలంలలో నిర్మాణాలు ధ్వంసం చేశారనే ఆరోపణలతో పాటు కొందరి స్టేట్‌మెంట్లు, పోలీసు దర్యాప్తు ఆధారంగా నాలుగు క్రిమినల్ కేసులు నమోదు కావడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే ఈ ఆరోపణలు పూర్తిగా అసత్యమని బాధిత కుటుంబం మొదటి నుంచీ చెబుతోంది. ప్రస్తుతం కూడా సర్వే నెంబర్ 53/1లోని ప్లాట్ నెంబర్లు 5, 11, 4, 6 స్థలం ప్రాంతాల్లో ఎటువంటి నిర్మాణాలు లేవని నిర్మాణాలు ధ్వంసం చేశారన్న ఆరోపణలకు భౌతిక ఆధారాలు కనిపించడం లేదని బాధితులు వాదిస్తున్నారు. గిరిజన కుటుంబంపై కేసులు నమోదు చేసిన వేగంతోనే తాము ఇచ్చిన ఫిర్యాదులను కూడా అప్పటి పోలీసు అధికారులు విచారించి ఉంటే ఈరోజు ఎన్‌సీఎస్‌టీ వరకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చేది కాదని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. నాలుగు కేసుల వెనుక ఉన్న వాస్తవాలు, 57 స్టాంప్ పేపర్ల వ్యవహారం తప్పుడు స్టేట్‌మెంట్ల అంశాలపై స్థానిక స్థాయిలో సరైన స్పందన లభించలేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ తప్పుడు కేసుల వెనుక మల్లు జ్యోతిబస్, అతని తమ్ముడు సుభాష్, వారి బినామీలు ఉన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. వజ్జ పాపమ్మ పేరుతో ఉన్న స్టాంప్ పేపర్లు జ్యోతిబస్ వద్ద ఉన్నట్లు కొన్ని ఆధారాలు ఉన్నాయని గిరిజన కుటుంబంపై జరుగుతున్న వేధింపుల్లో పరోక్షంగా అతని హస్తం ఉన్నట్లు తమకు బలమైన అనుమానం ఉందని పేర్కొంటున్నారు.

- కోర్టులో చూసుకోండి అన్న వైఖరి నుంచి వాస్తవాలు తేల్చండి అనే దశకు..!

బాధితుల కథనం ప్రకారం..గతంలో నాలుగు క్రిమినల్ కేసుల అంశంపై పలుమార్లు స్థానిక పోలీసు అధికారులను ఆశ్రయించినప్పటికీ కేసులు నమోదయ్యాయి... ఏదైనా ఉంటే కోర్టులో చూసుకోండి అనే సమాధానమే ఎక్కువగా వినిపించిందని చెబుతున్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించకుండా తాము చెబుతున్న అంశాలను నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లోనే జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ను ఆశ్రయించినట్లు బాధితులు పేర్కొంటున్నారు.

ఇప్పుడు అదే ఫిర్యాదుపై కమిషన్ స్పందించి నివేదిక కోరడంతో వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఎన్‌సీఎస్‌టీ జోక్యం తర్వాత అయినా నిర్మాణాలు ధ్వంసం చేశారన్న ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలు, 57 స్టాంప్ పేపర్ల వ్యవహారం తప్పుడు కేసుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరుగుతుందా లేదా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ కేసును నీరుగార్చేందుకు కేసుకు సంబంధం లేని అంశాలను తెరపైకి తీసుకొస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ఎన్‌సీఎస్‌టీ ఆదేశాలతో దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో భూమి కొనుగోలు, అమ్మకాల అంశాలను ప్రస్తావిస్తూ అసలు ఫిర్యాదులో ఉన్న అంశాలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయేమోనని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

- బినామీల హడావుడి దేనికోసం..?

బాధితుల ఆరోపణల ప్రకారం, కమిషన్ విచారణ ప్రారంభమైన తర్వాత కొందరు వ్యక్తులు మరింత చురుకుగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందని చెబుతున్నారు. అసలు ఫిర్యాదులో లేని అంశాలను ముందుకు తెస్తూ అసలు ప్రశ్నలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయేమోనని వారు అంటున్నారు. ముఖ్యంగా ప్రముఖ విద్యాసంస్థల అధినేత మేదరమెట్ల వెంకట చౌదరి కుటుంబ సభ్యులైన మల్లు జ్యోతిబస్, సుభాష్ తదితరుల పాత్రపై తాము మొదటి నుంచీ ప్రశ్నలు లేవనెత్తుతున్నప్పటికీ ఆ అంశాలపై స్పష్టత రాకపోవడం బాధిత కుటుంబాన్ని మరింత ఆందోళనకు గురిచేస్తోందని తెలుస్తోంది. ఎన్‌సీఎస్‌టీ విచారణ జరుగుతున్న సమయంలోనే వివాదాస్పద భూమి వద్ద కొత్త హడావుడులు, కొత్త ఆరోపణలు, కొత్త ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. కొంతమంది ఎస్టీ కులస్తులను గిరిజన కుటుంబాలపైకి ఉసిగొల్పే విధంగా సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని బాధితులు చెబుతున్నారు. ఇన్ని సంవత్సరాలు లేని హడావుడి ఇప్పుడు ఎందుకు జరుగుతోందనే ప్రశ్నను వారు లేవనెత్తుతున్నారు.

- ఆశలన్నీ డీఎస్పీ ఆదినారాయణ పైనే..!

ప్రస్తుతం బాధిత కుటుంబం ఆశలన్నీ కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పైనే పెట్టుకుంది. జాతీయ కమిషన్ కోరిన నివేదికను నిష్పక్షికంగా, సమగ్రంగా సిద్ధం చేస్తేనే ఈ వివాదంపై నెలకొన్న అనేక అనుమానాలకు తెరపడుతుందని వారు భావిస్తున్నారు. వజ్జ పాపమ్మ కుటుంబ సభ్యులపై నమోదు అయిన నాలుగు క్రిమినల్ కేసులకు ఆధారంగా పేర్కొన్న నిర్మాణాల వాస్తవస్థితి ఏమిటి..? 57 స్టాంప్ పేపర్ల వ్యవహారంలో నిజాలు ఏమిటి..? తప్పుడు స్టేట్‌మెంట్ల ఆరోపణల్లో వాస్తవం ఎంత..? అనే అంశాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని బాధితులు కోరుతున్నారు. కొత్తగూడెం డివిజన్ స్థాయిలో ఈ వ్యవహారాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించి ఎలాంటి ఒత్తిళ్లు, ప్రభావాలు లేకుండా విచారణ నిర్వహిస్తేనే గిరిజన కుటుంబానికి న్యాయం జరిగిందనే భావన ప్రజల్లో ఏర్పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# స్పందించిన పంచాయతీ పాలకవర్గం... పరిష్కారమైన నీటి నిల్వ సమస్య

- సిమెంట్ రోడ్డుపై నీరు నిలవకుండా చర్యలు
- పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న గ్రామ ప్రజలు





**అన్నపురెడ్డిపల్లి, జూన్ 12 (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ సమీపంలోని సిమెంట్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గ్రామ ప్రజలు పాలకవర్గ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన గ్రామ సర్పంచ్ లాకావత్ లక్ష్మి , ఉపసర్పంచ్ మారగాని అశోక్ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. రోడ్డుపై నిలిచిన నీరు సులభంగా బయటకు వెళ్లే విధంగా మట్టి పోసి రహదారిని సమతలీకరించారు. అలాగే నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించి, నిల్వ నీరు వేరే వైపు వెళ్లేలా మార్గం కల్పించారు. దీంతో గత కొన్ని రోజులుగా ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోయాయని స్థానికులు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన సర్పంచ్ లాకావత్ లక్ష్మి , ఉపసర్పంచ్ మారగాని అశోక్ తో పాటు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులందరినీ గ్రామ ప్రజలు అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇదే చొరవ కొనసాగించాలని కోరారు.

# నిద్రావస్థలో నిఘా నేత్రాలు..!

- అలంకారప్రాయంగా మారిన సీసీ కెమెరాలు
- నిర్వహణ లోపంతో నేరాల నియంత్రణకు గండి
- లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోందన్న విమర్శలు
- తక్షణ మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థుల డిమాండ్

**టేకులపల్లి, జూన్ 12, ప్రజాజ్యోతి:** నేరాల నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే సీసీ కెమెరాలు టేకులపల్లి మండలంలో నిర్వీర్యంగా మారుతున్నాయి.ఒకప్పుడు గ్రామాల్లో భద్రతకు కవచంగా నిలిచిన నిఘా నేత్రాలు ప్రస్తుతం నిర్వహణ లోపాలతో మూగసాక్షులుగా నిలిచిపోయాయి. పోలీసు శాఖ కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, దాతలు, వ్యాపారులు, గ్రామస్థుల సహకారంతో లక్షలాది రూపాయల వ్యయంతో ప్రధాన కూడళ్లు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార కేంద్రాలు, గ్రామ ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. అయితే కాలక్రమేణా వాటి నిర్వహణను విస్మరించడంతో అనేక కెమెరాలు పనిచేయకుండా పోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**భద్రతకు భరోసా ఇవ్వాల్సిన కెమెరాలే బంద్....**

పోలీసు అధికారులు తరచూ "ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం" అని పేర్కొంటుంటారు. నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడం,అనుమానాస్పద కదలికలను పర్యవేక్షించడం, రోడ్డు ప్రమాదాల దర్యాప్తు, చోరీలు, గొడవలు, ఇతర శాంతిభద్రతల సమస్యల పరిష్కారంలో సీసీ కెమెరాలు కీలక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయి. కానీ మండలంలోని పలు గ్రామాల్లో కెమెరాలు పనిచేయకపోవడంతో వాటి అసలు ప్రయోజనం ప్రశ్నార్థకంగా మారింది.

**సాంకేతిక లోపాలు... పట్టించుకోని నిర్వహణ....**

చాలా చోట్ల విద్యుత్ సమస్యలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ లోపాలు, డీవీఆర్ వ్యవస్థల పనితీరు దెబ్బతినడం,కెమెరాల సాంకేతిక సమస్యలు నెలకొన్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. కొన్ని కెమెరాలు పూర్తిగా పనిచేయకపోగా,మరి కొన్ని రికార్డింగ్ వ్యవస్థ లేకుండా నిరుపయోగంగా మారినట్లు సమాచారం. సమస్యలను గుర్తించినప్పటికీ వాటి మరమ్మతుల విషయంలో సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నా యి.నేరస్తులకు వరంగా మారుతున్న పరిస్థితి సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వల్ల నేరాలకు పాల్పడే వ్యక్తులకు ఇది అనుకూల పరిస్థితిగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోం ది.ఏదైనా దొంగతనం,చోరీ,ప్రమాదం లేదా ఇతర నేర ఘటనలు చోటుచేసుకున్నప్పుడు దర్యాప్తుకు అవసరమైన వీడియో ఆధారాలు లభించకపోవడంతో కేసుల విచారణలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. దీంతో గ్రామాల్లో భద్రతా వ్యవస్థపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. ప్రజాధనం వృథా అవుతోందన్న విమర్శలుప్రజల విరాళాలు,దాతల సహకారం, ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారడం వల్ల లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.ఏర్పాటు సమయంలో చూపిన శ్రద్ధ నిర్వహణ విషయంలో కనిపించడం లేదని, దీనివల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని అంటున్నారు.

**సమగ్ర పరిశీలన చేపట్టాలి....**

మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపై ప్రత్యేక సర్వే నిర్వహించి,పనిచేయని కెమెరాలను గుర్తించాలని గ్రామస్థులు కోరుతున్నారు.అవసరమైన మరమ్మతులు చేపట్టి, ఆధునిక సాంకేతికతతో వాటిని తిరిగి పూర్తిస్థాయిలో వినియోగం లోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి గ్రామంలో కెమెరాల నిర్వహణకు బాధ్యులను నియమించి, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.అధికారులు స్పందించాలి సీసీ కెమెరాలు కేవలం అలంకారప్రాయంగా కాకుండా నిజమైన నిఘా నేత్రాలుగా పనిచేసేలా పోలీసు శాఖ, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. భద్రతా వ్యవస్థ బలోపేతానికి కెమెరాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తేనే నేరాల నియంత్రణలో ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



## లచ్చ తండాలో విషాదం.. వడదెబ్బతో రైతు మృతి



**టేకులపల్లి,జూన్12,ప్రజాజ్యోతి:** లచ్చతండా గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు జాటోత్ భీమిజి (45)శుక్రవారం ఉదయం తన వ్యవసాయ పొలంలో పత్తి గింజలు వేస్తుండగా వడదెబ్బకు గురయ్యాడు.తీవ్ర అస్వస్థతకు లోనైన ఆయన అక్కడికక్కడే స్పృహ కోల్పోయి మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.మృతుడు భీమిజికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.కుటుంబానికి ఆయనే ఆధారంగా ఉండటంతో వారి పరిస్థితి విషాదకరంగా మారింది.ఈ ఘటనతో లచ్చ తండా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్థులు భీమిజీ మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ,బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన సహాయం అందించాలని కోరుతున్నారు.

## బాధితకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్



**టేకులపల్లి,జూన్ 12, ప్రజాజ్యోతి:** ఖమ్మంలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం, హత్యాయత్నం ఘటనపై బీఆర్ఎస్ టేకులపల్లి మండల మాజీ అధ్యక్షుడు బొమ్మర వరప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.12 ఏళ్ల అమాయక బాలికపై కామాంధుడు, డ్రైవర్ గౌస్ అత్యంత దారుణంగా దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఖమ్మంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో బాలికపై అత్యాచారానికి పాల్పడిన అనంతరం, ఆమెను నాలుగో అంతస్తు నుంచి కిందకు తోసివేసి హత్య చేయడానికి ప్రయత్నించడం అమానుష చర్య అని పేర్కొన్నారు.నిందితుడిని వెంటనే చట్టం ముందు నిలబెట్టి, ఉరిశిక్ష పడేలా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగాన్ని వరప్రసాద్ డిమాండ్ చేశారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం ఎన్నో చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ, ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం బాధిత బాలిక పరిస్థితి విషమంగా ఉన్నందున, ఆమెకు అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందించాలని కోరారు. అలాగే తీవ్రంగా నష్టపోయిన బాలిక కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బాధితురాలి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, అన్ని విధాలా న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

## నేడు మణుగూరులో బీఎల్‌ఏల శిక్షణ శిబిరం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు గొడిశాల రామనాథం



**పినపాక,జూన్ 12(ప్రజాజ్యోతి )** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ శిబిరం శనివారం మణుగూరులో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు గొడిశాల రామనాథం తెలిపారు. శుక్రవారం ఆయన పినపాక మండల కేంద్రంలో మాట్లాడారు. మణుగూరులోని డీవీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ షబ్బీర్ అలీ ట్రైనర్‌గా వ్యవహరించనున్నారన్నారన్నారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న హాజరుకానున్నారని తెలిపారు. కావున నియోజకవర్గానికి చెందిన బీఎల్‌ఏలు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## జాతీయ మానవ హక్కులు-ఆర్టీఐ కౌన్సిల్ నూతన కార్యాలయం ప్రారంభం




**పినపాక,జూన్ 12(ప్రజాజ్యోతి)** జాతీయ మానవ హక్కులు–ఆర్టీఐ కౌన్సిల్ నూతన కార్యాలయాన్ని పినపాక –మణుగూరు మండలం సరిహద్దు ప్రాంతం చిక్కుడు గుంట గ్రామంలో భద్రాద్రి పవర్ ప్లాంట్ ఎదురుగా శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జర్నలిస్ట్ సంఘం నాయకుల చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభింపజేశారు. అనంతరం మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష సేవలందిస్తున్న పలువురిని శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా శ్రీరామ్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ, ప్రజల హక్కుల పరిరక్షణ, సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడం, బాధితులకు న్యాయం అందించడంలో జాతీయ మానవ హక్కులు–ఆర్టీఐ కౌన్సిల్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మానవ హక్కులపై అవగాహన పెంచడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి సంస్థ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు.ప్రజల హక్కులకు భంగం కలిగిన సందర్భాల్లో బాధితులకు చట్టపరమైన సహాయం అందించడంతో పాటు, సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొనేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు బందా సతీష్, కట్ల ప్రణయ్ కుమార్, కుంజ గణేష్, కాసినేడి బలరామకృష్ణ,సూరే పల్లి ధనుంజయరావు,ప్రవీన్, జర్నలిస్ట్ లు బిల్లా నాగేందర్, శ్రీరామ్ బృహస్పతి, సాంబశివరావు, సాయి ప్రవీణ్, పలువురు జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారిని పాఠశాలకు పంపుదాం

- బానోత్ లక్ష్మా
- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజం ముందుకు రావాలి
- చిన్నారి చేతిలో పుస్తకం ఉండాలి... పనిముట్టు కాదు
- బాల కార్మిక వ్యవస్థ లేని సమాజమే నిజమైన అభివృద్ధి



**టేకులపల్లి,జూన్12, ప్రజాజ్యోతి:** ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ లక్ష్మా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి విద్యను అభ్యసించే హక్కు, ఆడుకునే హక్కు, సురక్షితమైన బాల్యాన్ని గడిపే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. అయితే పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక అసమానతలు వంటి కారణాల వల్ల ఇప్పటికీ అనేక మంది చిన్నారులు బాల కార్మికులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,ప్రజాప్రతి నిధులు,స్వచ్ఛంద సంస్థలు, ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పనుల్లో నిమగ్నమైన చిన్నారులను గమనించినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు.చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ హోటళ్లు,టీ దుకాణాలు, ఇటుక బట్టీలు,వ్యవసాయరంగం, పరిశ్రమలు గృహ పనులు వంటి అనేక రంగాల్లో ఇంకా బాల కార్మికులు కనిపిస్తున్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితి పూర్తిగా మారాలంటే ప్రతి చిన్నారిని పాఠశాలకు పంపించి విద్యావంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు.చిన్నారి చేతిలో పుస్తకం ఉండాలి... పనిముట్టు కాదు. బాల్యం పనికోసం కాదు... బంగారు భవిష్యత్తు కోసం. ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలకు పంపుదాం... వారి కలలకు రెక్కలు తొడుగుదాం. బాల కార్మిక వ్యవస్థ లేని సమాజమే నిజమైన అభివృద్ధి చెందిన సమాజం అని బానోత్ లక్ష్మా పేర్కొన్నారు.

## ఈ నెల 15 నుంచి ఇంటర్ ప్రవేశాలకు కౌన్సిలింగ్

**ఇల్లందు, జూన్ 12 (ప్రజా జ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభించనున్నట్లు భద్రాచలం ఆర్సిఓ బి అరుణకుమారి, సుదిమళ్ళ పాఠశాల ప్రిన్సిపల్ కె మాధవి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాల, బాలికలు మొదటి సంవత్సరం ఇంటర్ ప్రవేశం కొరకు 15వ తేదీన భద్రాచలం గురుకుల సంక్షేమ పాఠశాల కళాశాలలో ఉదయం 9 గంటలకు తమ ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. జిల్లా పరిధిలోని భద్రాచలం, సుదిమళ్లలో బాలికలకు, కిన్నెరసాని, దమ్మపేట, గుండాలలో బాలురకు ఎంపిసి, బైపిసి గ్రూపులలో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడిగా కడుదుల వీరన్న ఎన్నిక



**టేకుల ప ల్లి, జూన్1 2, ప్రజాజ్యోతి:** తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యుడిగా టేకులపల్లి మండలానికి చెందిన కడుదుల వీరన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జూన్ 11న మణుగూరులో ఘనంగా నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ మహాసభల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కమిటీలో టేకులపల్లి మండలానికి ప్రాతినిధ్యం కల్పిస్తూ కడుదుల వీరన్నను సభ్యుడిగా ఎన్నుకున్నట్లు సంఘం ముఖ్య నాయకులు ప్రకటించారు. జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికైన అనంతరం కడుదుల వీరన్న మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన సంఘం నాయకత్వానికి, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానన్నారు. అలాగే కార్మికుల హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రత, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై సంఘంతో కలిసి పోరాటాలు నిర్వహిస్తానని వెల్లడించారు.

## రైతు భరోసా ఆలస్యం సరికాదు

- బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు



**చర్ల, జూన్ 12 (ప్రజాజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమై రైతులు వ్యవసాయ పనులు చేపట్టినప్పటికీ ఇప్పటి వరకు రైతు భరోసా నిధులు పూర్తి స్థాయిలో రైతుల ఖాతాల్లో జమ కాలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులను రాజులను చేస్తామని, ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా, కౌలు రైతులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం, రైతు రుణమాఫీ, పండిన ప్రతి గింజ కొనుగోలు వంటి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. గత డిసెంబర్‌లో విడుదల చేయాల్సిన నిధులను మార్చిలో కొంతమంది రైతులకు మాత్రమే ఒక ఎకరానికి పరిమితం చేసి చెల్లించారని, మిగిలిన రైతులకు ఇప్పటికీ అందలేదని అన్నారు. మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా కేవలం మూడు సార్లు మాత్రమే విడుదలైందని, అది కూడా ఒకటి లేదా రెండు ఎకరాలకే పరిమితమైందని పేర్కొన్నారు. అదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతు బంధు నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యేవని గుర్తు చేశారు. 2018 నుంచి 2023 వరకు రైతు బంధు పథకం ద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు భారీ మొత్తంలో ఆర్థిక సాయం అందించారని తెలిపారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చి, ఆ భూములకు కూడా రైతు బంధు వర్తింపజేసి గిరిజన రైతులను ఆదుకున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ప్రస్తుతం రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నట్లే రైతు భరోసా కోసం కూడా ఎదురుచూస్తున్నారని, కాంగ్రెస్ పాలనలో రైతులు అప్పుల పాలవుతున్నారని విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను రైతులందరికీ విడుదల చేసి వారిని ఆదుకోవాలని దొడ్డి తాతారావు కోరారు.

## వాతావరణానికి అనుకూలంగా ఉన్న పంటలు పండించాలి

- రైతాంగానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం





**ఇల్లందు, జూన్ 12 (ప్రజా జ్యోతి)** మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి లభ్యత, వర్షాలను ఆధారం చేసుకొని రైతులు పంటల సాగును చేసుకోవాలని ఏడిఏ లాల్ చంద్ తెలిపారు. శుక్రవారం పిఏసిఎస్ కార్యాలయంలో జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఏడాది వర్షాలు పరిస్థితి వాతావరణ శాఖ సైతం అంచనా వేయలేని స్థితిలో ఉందని దీన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగు చేసే పంటలను నీటి ఎద్దడిని తట్టుకునే పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సహజ సిద్ధమైన ఎరువులను వాడాలని తెలిపారు. జీలుగా పిల్లి పెసర అలాంటి వాటిని వినియోగించాలన్నారు. ఏడాది అధిక మొత్తంలో మొక్కజొన్న దిగుబడి వచ్చినట్లు తెలిపారు. దీని దృష్ట్యా ఈసారి పంట మార్పిడి పై దృష్టి సారించాలని పెసర్లు, నువ్వులు, కందులు, ఆయిల్ ఫామ్ వంటి పంటల సాగుకు కృషి చేయాలని సూచించారు. జీలుగు విత్తనాలను వినియోగించడం మూలాన ఖర్చు తగ్గడంతో పాటు సహసీదమైన ఎరువులు పంటకు లభిస్తుందన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసిందన్నారు. ఇల్లందు మండలంలో రెండు లక్షల టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. సబ్సిడీ పోను 30 కేజీల బస్తా రూ. 2450.50 పైసలకు అందిస్తున్నట్లు తెలిపారు. 550 బస్తాలు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయని ఇప్పటికే కొంతమంది రైతులు కొనుగోలు చేసుకోవడం జరిగిందని, అవసరమైతే మరింత తెప్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు పిఎసిఎస్ సీఈఓ హిరాలాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, మున్సిపల్ కౌన్సిలర్ లు రమేష్, జాఫర్, వంశీ, సైదుమియా, ఏఓ సతీష్ కుమార్, సొసైటీ డైరెక్టర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం, నాయకుడు దొడ్డ డానియల్, పిఎసిఎస్ సిబ్బంది ఇమ్రాన్, నరసింహా, రామకృష్ణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కులపై అవగాహన సదస్సు



**చర్ల, జూన్ 12:(ప్రజాజ్యోతి):** ఆదివాసీ యువతలో హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 21న చర్ల మండలంలోని ఎదురుగుట్టలలో సమిష్టి యువజన సమావేశం నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు వాసం ముసలయ్య తెలిపారు. ఈ సమావేశానికి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు చెందిన ఆదివాసీ యువత అధిక సంఖ్యలో పాల్గొని తమ హక్కులు, రాజ్యాంగ పరిరక్షణలు, ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన ప్రత్యేక చట్టాలపై అవగాహన పొందాలని సూచించారు. సమావేశంలో 1/59, 1/70 భూసంరక్షణ చట్టాలు, షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులు, భూ సమస్యలు, అక్రమ భూ బదలాయింపులు, ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే ఎస్టీ జాబితాలో లంబాడీల చేర్పు అంశంతో పాటు ఆదివాసీలకు సంబంధించిన వివిధ సమస్యలపై యువతతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా 1960లో అమలులోకి వచ్చిన రుణనిషేధ చట్టం, ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ వలసల నియంత్రణ, హక్కుల పరిరక్షణలో యువత పాత్ర వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రతి ఆదివాసీ గూడెంలో చైతన్యవంతమైన యువ నాయకత్వం ఎదగాలని, ప్రతి ఇంటి నుంచి ఒక ఉద్యమ స్ఫూర్తి కలిగిన యువకుడు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఆదివాసీ మహనీయుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని హక్కుల సాధన కోసం యువత ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని ఆదివాసీ యువత పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొనాలని వాసం ముసలయ్య కోరారు.

## గోదుమవాగు బ్రిడ్జి గుంతలు పూడ్చాలి: సీపీఐ




**కొత్తగూడెం, జూన్ 12 (ప్రజాజ్యోతి)** రామవరం సమీపంలోని గోదుమవాగు బ్రిడ్జిపై ఏర్పడిన ప్రమాదకర గుంతలను వెంటనే పూడ్చి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని సీపీఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన బ్రిడ్జిని సందర్శించి గుంతల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి దెబ్బతిన్నా జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు. బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి జాతీయ రహదారిపై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కూరపాటి సుధాకర్, సర్పంచ్ వాడె రాములు, సీపీఐ నాయకులు పాటి మోహన్‌రావు, దాసరి అశోక్, సతీష్, కృష్ణ, ఇరిగినేని రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికులకు హామీలు అమలు చేయాలి: సీఐటీయూ



**కొత్తగూడెం, జూన్ 12 (ప్రజాజ్యోతి)** గ్రామ పంచాయతీ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జె. రమేష్ డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాల విడుదల, మల్టీపర్పస్ విధానం రద్దు, శాశ్వతీకరణ, ఆదివారాలు, పండుగ సెలవుల అమలు తదితర డిమాండ్లతో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.జె. రమేష్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ కార్మికులకు రూ.18 వేల కనీస వేతనం అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదన్నారు. మల్టీపర్పస్ విధానం కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లాలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేసి ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.30 లక్షల పరిహారం, అంత్యక్రియల ఖర్చులకు రూ.30 వేల సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రెండో పీఆర్సీ వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా ఖాతాల్లో జమ చేయాలని కోరారు. నాలుగేళ్లుగా యూనిఫారాలు, అవసరమైన సామగ్రి అందించలేదని విమర్శించారు. ధర్నా అనంతరం ఇన్ చార్జి జిల్లా పంచాయతీ అధికారిణి హరిచందనకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆమె సోమవారం నాటికి యూనిఫారాలు, సబ్బులు, చీపుర్లు పంపిణీ చేస్తామని ఇన్సూరెన్స్ ప్రీమియంను గ్రామ పంచాయతీల నుంచే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఆదివారాలు, పండుగ సెలవుల అమలుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె. సత్య, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దల శివకృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు చిక్కుల శ్రీను, విజయలక్ష్మి, శ్రీను, మణెమ్మ, వెంకటేశ్వర్లు, మల్లయ్య, స్వామి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**గోదావరి అంటేనే జీవనది. కోట్లాది మందికి జీవం పోసే తల్లి. కానీ నేడు ఆ తల్లి గర్భఘోష ఎవరికీ పట్టడం లేదు. పూడికతీత పేరుతో ఇసుక తోడేళ్లు గోదారమ్మ పొట్టను ప్రొక్లైన్లతో చీలుస్తున్నారు. రాత్రి అయితే చాలు, నదీ గర్భంలో యంత్రాల హోరు. పగలంతా లారీల పరుగు. కోర్టు ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనలు, పర్యావరణం అన్నీ గాలికొదిలేశారు. “అధికారులు ఏం చేస్తున్నారు?”అని అడిగితే, “మామూళ్ల మత్తులో జోగుతున్నారు”అని గోదావరి తీరం గొల్లుమంటోంది. ఇసుకాసురుల అక్రమ దందాకు తెర పడేదెన్నడు? వారి వెనక ఉన్న తోడు నీడ ఎవరు? జర దేఖో కలెక్టర్ సాబ్... అంటూ గోదారమ్మ బిడ్డలు నిలదీస్తున్నారు.**



• మణుగూరు, ప్రజాజ్యోతి

# గోదారమ్మ... గర్భఘోష

## అధికారులకు పట్టదా...!!

- ఎన్జీటీ నిషేధం నీటి మూటేనా...? కోర్టు ఆదేశాలు కాగితాలకే పరిమితమా...!
- ఇసుక తోడేళ్ల కాసులకు కక్కుర్తి పడుతున్న అధికార యంత్రాంగం
- ఇసుకాసురుల అక్రమ దందాను ఆపలేరా..?
- రాత్రి పగలు తేడా లేకుండా యంత్రాల హోరు
- ఇసుక తోడేళ్ల వెనక తోడు నీడ ఎవరు..?
- జర దేఖో కలెక్టర్ సాబ్....

జాతీయ హరిత ట్రిబ్యునల్ పర్యావరణ పరిరక్షణ చట్టం కింద ఇసుక తవ్వకాలపై కఠిన నిబంధనలు విధించింది. నదీ గర్భంలో 3 మీటర్ల లోతుకు మించి తవ్వకూడదు. భారీ యంత్రాలు, ప్రొక్లైన్లు, హిటాచీల వినియోగం పూర్తిగా నిషేధం. మానవ శ్రమతోనే ఇసుక తీయాలి. కానీ ఓ బడా బాబు ఏళ్ల తరబడి ఇసుక సామ్రాజ్యానికి "శ్రీకారం" చుట్టి, టీజీఎండిసి అధికారులను తన చెప్పుచేతల్లో పెట్టుకొని, గిరిజన సొసైటీ ఇసుక ర్యాంపుల బినామీ సామ్రాజ్యాన్ని స్థాపించుకొని చక్రవర్తిగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ కోట్లు గడిస్తున్నాడు. ప్రతి ర్యాంపుకు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, స్టేట్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అథారిటీ అనుమతి తప్పనిసరి. డిస్ట్రిక్ట్ సర్వే రిపోర్ట్ లేకుండా ఒక్క ట్రాక్టర్ ఇసుక కూడా తరలించకూడదు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు తవ్వకాలు, రవాణా నిషేధం. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 లక్షల జరిమానా, యంత్రాల సీజ్, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎన్జీటీ స్పష్టం చేసింది. ఇది సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని, అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తేల్చి చెప్పింది.

### »» గోదారమ్మ గర్భఘోష - వినిపించని ఆర్తనాదం

గోదావరి ఇసుక తవ్వకాలపై జాతీయ హరిత ట్రిబ్యునల్ స్పష్టమైన నిషేధం విధించింది. గోదావరి తీరంలో 3 మీటర్లకు మించి తవ్వకూడదు, యంత్రాలు వాడకూడదు, రాత్రి తవ్వకాలు నిషేధం అని తేల్చి చెప్పింది. కానీ మణుగూరు నుంచి భద్రాచలం వరకు పరిస్థితి భిన్నం. రోజుకు 500 లారీల ఇసుక అక్రమంగా తరలిపోతోంది. 10 అడుగుల నుంచి 25 అడుగుల లోతు గుంతలు తీస్తున్నారు. దీంతో నదీ ప్రవాహం దిశ మారిపోతోంది. వరద వస్తే లంక గ్రామాలు ముంపుకు గురవుతాయి. ఇప్పటికే భూగర్భ జలాలు 100 అడుగులకు పడిపోయాయి, బోర్లు ఎండిపోతున్నాయి, మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుంది. గోదారమ్మ గర్భంలో రక్తం కారుతున్నా అధికార యంత్రాంగానికి వినిపించడం లేదు. వినిపించినా పట్టించుకోవడం లేదు.

### »» ఇసుక తోడేళ్ల కాసులకు కక్కుర్తి పడుతున్న యంత్రాంగం

“అధికారులు ఎందుకు స్పందించరు?” అనే ప్రశ్నకు తీరం వెంబడి ఒక్కటే సమాధాన..."మామూళ్లు". నెలకు ఒక్కో ర్యాంపు నుంచి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ‘పైకి’ వెళ్తున్నాయని బహిరంగ రహస్యం. అందుకే కలెక్టర్, ఆర్డీఓ, మైనింగ్ ఏడీ, తహశీల్దార్ స్థాయి అధికారులు 6 నెలలైనా ర్యాంపుల వైపు కన్నెత్తి చూడలేదు. సీసీ కెమెరాలు పని చేయవు. వే బ్రిడ్జిలు 2 ఏళ్లుగా రిపేర్‌లో ఉన్నాయి. సంబంధిత అధికారులల లాగిన్‌లు బినామీ కాంట్రాక్టర్ల చేతిలో ఉన్నాయి. 10 టన్నుల బిల్లుపై 35 టన్నులు తరలిస్తున్నా అడిగేవారు లేరు. ఫిర్యాదు చేస్తే “మాకు సిబ్బంది లేరు” అని సాకు. ఒకసారి తనిఖీకి వెళ్లిన అధికారిని ఇసుక మాఫియా బెదిరించిన ఘటన కూడా ఉంది. అంటే భయమా? లేక భాగస్వామ్యమా? అన్న అనుమానం ప్రజల్లో బలంగా ఉంది.

### »» ఇసుకాసురుల అక్రమ దందా ఆపలేరా?

ఆపాలంటే ముందు అధికారులు మేల్కోవాలి. కానీ వారే నిద్ర నటిస్తున్నారు. హైదరాబాద్ బడా కాంట్రాక్టర్లు డమ్మీ గిరిజన సొసైటీలు పెట్టి దందా నడుపుతున్నారు. సొసైటీ అధ్యక్షుడికి నెలకు రూ.20 వేలు ఇచ్చి, నెలకు రూ.12 కోట్ల వ్యాపారం చేస్తున్నారు. గ్రామసభ తీర్మానం లేకుండానే తవ్వకాలు. రాత్రి వేళ ప్రొక్లైన్లు, హిటాచీలతో యథేచ్ఛగా తవ్వకాలు. ఇందిరమ్మ ఇళ్లకు “ఇసుక లేదు” అని చెప్పి, అదే ఇసుకను ప్రైవేట్ వెంచర్లకు రూ.10 వేలకు అమ్ముతున్నారు. ప్రశ్నించిన వారిపై దాడులు, అక్రమ కేసులు. “కోర్టు ఆదేశాలైనా మమ్మల్ని ఏమీ చేయలేవు” అని ఇసుకాసురులు సవాల్ విసురుతున్నారు. నిజంగా ఆపలేరా? ఆపే దమ్ము లేదా? లేక ఆపాలని లేదా?

### »» ఇసుక తోడేళ్ల వెనక తోడు నీడ ఎవరు?

ఇదే అసలు ప్రశ్న. ఒక సాధారణ కాంట్రాక్టర్‌కు అంత ధైర్యం ఎక్కడిది? కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసే బలం ఎక్కడిది? అధికారులను బెదిరించే స్థాయి ఎలా వచ్చింది? దీని వెనుక బలమైన రాజకీయ అండదండలు ఉన్నాయన్నది బహిరంగ విమర్శ. “అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ సన్నిహితుడే ఈ దందా నడుపుతున్నాడు” అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. నెలవారీ వసూళ్లలో ‘వాటాలు’ పైస్థాయికి వెళ్తున్నాయని గుసగుసలు. అందుకే పోలీసులు కేసు నమోదు చేయరు. మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోరు. రెవెన్యూ యంత్రాంగం చూసీచూడనట్లు ఉంటుంది. ‘తోడు నీడ’ ఎవరో తెలిసినా, సాక్ష్యాలు దొరకవు. ఎందుకంటే మొత్తం వ్యవస్థే లాలూచీ అయిపోయింది.

### »» జర దేఖో కలెక్టర్ సాబ్...

జిల్లాకు పెద్ద కలెక్టర్ సార్. డీలీస్సీ కమిటీ ఛైర్మన్ మీరే. మీ ఒక్క సంతకంతో ర్యాంపు సీజ్ అవుతుంది. మీ ఒక్క ఫోన్ కాల్‌తో అక్రమ లారీ ఆగిపోతుంది. మీ ఒక్క విజిట్‌తో ఇసుక మాఫియా గజగజ వణుకుతుంది. కానీ మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు సార్? గోదారమ్మ ఏడుపు మీకు వినిపించడం లేదా? పేదల ఇందిరమ్మ ఇల్లు ఆగిపోతే మీకు బాధనిపించదా? కోర్టు ఆదేశాలు ఉల్లంఘన అవుతుంటే మీకు కోపం రాదా? ‘జర దేఖో కలెక్టర్ సాబ్’.. ఒక్కసారి అర్ధరాత్రి మణుగూరు ర్యాంపుకు రండి. ప్రొక్లైన్ల హోరు వినండి. గోదారి గర్భం ఎలా గుల్ల అవుతుందో చూడండి. అప్పుడైనా గోదావరి తల్లి పెడుతున్న ఘోష మీకు తెలుస్తుందేమో. కలెక్టర్ స్వయంగా రాత్రి వేళ ఆకస్మిక తనిఖీలు చేయాలని, డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టాలని, ఎన్జీటీ నిబంధనలు ఉల్లంఘించిన ప్రతి యంత్రాన్ని సీజ్ చేసి, రూ.5 లక్షల జరిమానా విధించాలని, మామూళ్లు తీసుకున్న అధికారులపై ఏసీబీ విచారణ జరిపి, సస్పెండ్ చేయాలని, గ్రామసభలకు పూర్తి అధికారాలు ఇచ్చి ఇసుక విక్రయాల డబ్బును నేరుగా పంచాయతీ ఖాతాలో జమ చేయాలని, ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వమే ఉచితంగా ఇసుక సరఫరా చేసే విధానం తేవాలని పలు ఆదివాసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గోదారమ్మ తల్లి గర్భాన్ని తోడేళ్లు పీక్కుతింటుంటే అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేల్కొనకపోతే, ప్రకృతే తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ప్రజలు హెచ్చరిస్తున్నారు. మరి అధికారులు ఇసుకాసురుల బినామీ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.



# రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- ఇందిరమ్మ ఇళ్ల ముసుగులో మూడు పూలు ఆరు కాయలుగా సాగుతున్న దందా
- ఈ మాఫియాకు ప్రజా ప్రతినిధుల అండదండలే కారణమా..?
- చోద్యం చూస్తున్న రెవిన్యూ,మైనింగ్ అధికారులు
- ప్రభుత్వం నిధికి భారీ గండి

**అశ్వాపురం, జూన్ 12, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తోలకాలు రాత్రి పగలు లేకుండా మట్టి మాఫియా అక్రమార్కులు పెట్రేగిపోతున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా రాత్రింబవళ్లు అనధికారంగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ సంపదను కొల్లగొడుతూ కొందరు వ్యక్తులు యదేచ్ఛగా సాగిస్తున్న ఈ అక్రమ దందా పై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములు నుంచి మట్టిని తవ్వుతూ తరలిస్తున్నారని రాత్రి వేళలో భారీ శబ్దాలతో నటిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు వీధులలో నుంచి వెళుతుండడంతో ప్రజలకు నిద్ర పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. దీనికి కారణం మైనింగ్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల కొందరు అధికార పార్టీల బడా బాబుల అండదండలతో స్థానిక గుట్టలను, చెరువుల మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము తీసుకుంటున్నారని, గతంలో పత్రికల ద్వారా ఎన్నోసార్లు సమాచారాన్ని తెలియజేసినా సంబంధిత అధికారులకు నిద్ర మత్తులో ఉన్నట్లు తెలుస్తుందని మండల ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. ఈ మట్టి దందా వల్ల ప్రభుత్వ ఖజానా గండి పడడమే కాకుండా పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని, ఈ అక్రమ తవ్వకాలపై అధికారులు అప్పుడప్పుడు కేసు నమోదు చేసినా ఈ దందా అడ్డు అదుపు లేకుండా కొనసాగుతుంది. ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వి 1500 నుంచి 2500 రూపాయల వరకు విక్రయిస్తున్నారని, ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. ప్రతిరోజు సాయంత్రం సూర్యుడు అస్తమించగానే మట్టి మాఫియాకు రెక్కలు వస్తాయి. సాయంత్రం ఐదు అయితే మట్టి మాఫియాకు కాసుల వర్షం కురిపిస్తోంది. అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపడుతూ ఉంటే ఆయా శాఖ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని తెలుస్తుంది. ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని సమాచారం. ఇంత మట్టి తవ్వకాలు చేపట్టి తవ్వుతుంటే అధికారులు చూడనట్లుగా పోతున్నారు వాస్తవంగా ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే రెవెన్యూ, మైనింగ్,అనుమతితో పాటు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఏ అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మట్టి తవ్వుతూ దర్జాగా తరలిస్తున్నారు అంటే అన్ని శాఖల అధికారులు మట్టి మాఫియా తో కుమ్మక్కై,ఈ దందా నీ నడిపిస్తున్నారని మండల ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైనా మట్టి మాఫియా అక్రమ రవాణా పై నిఘా ఉంచి ప్రభుత్వ సంపాదన కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## చెరువు ఆక్రమణ తొలగించాలి

- రైతుల రిలే నిరాహార దీక్ష
- ఎర్రగుంట చెరువును కాపాడాలని జిల్లా కలెక్టర్‌కు రైతుల విజ్ఞప్తి



**పాల్వంచ, జూన్ 12, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 48వ డివిజన్ ఎర్రగుంట గ్రామ చెరువును ఆక్రమణదారుల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ గ్రామ రైతులు శుక్రవారం రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. చెరువు వద్ద టెంట్ ఏర్పాటు చేసి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ దీక్షల్లో పాల్గొన్నారు. గ్రామానికి ప్రధాన జలవనరుగా ఉన్న చెరువును ఓ వ్యక్తి ఆక్రమించి, శిఖం భూమిని సాగు చేస్తున్నాడని రైతులు ఆరోపించారు. చెరువులోని నీటిని పూర్తిగా బయటకు మళ్లించడం వల్ల పంట పొలాలకు సాగునీరు అందడం లేదని, పశువులకు తాగునీటి స స్య కూడా ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ పట్టా ఉందంటూ చెరువు మొత్తం తనదేనని చెప్పుకుంటూ ఆక్రమణదారుడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించిన రైతులు, జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని చెరువును రక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఆక్రమణదారుల నుంచి చెరువులను కాపాడే వరకు తమ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని రైతులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ నాయకుడు దొడ్డ రవికుమార్, రైతు నాయకులు మండల వెంకన్న, సత్యనారాయణ, మేక ప్రసాద్, నరసింహమూర్తి, తోడేటి సత్యం, రెడ్డి మల్ల వెంకటయ్య, ఆరేపల్లి సత్యనారాయణ, ఆంజనేయులు, శంకర్, బూరా వెంకటేశ్వరావు, మేక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ పై నిరసన



**భద్రాచలం టౌన్, జూన్ 12 ప్రజాజ్యోతి** మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ పై సిబిఐ విచారణ జరిపించాలని దోషులు ఎవరో తేల్చాలని భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షుడు బూసిరెడ్డి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాచలంలో మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర తన అనుచరులతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి గత 12 సంవత్సరాల నుంచి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నరేంద్ర మోడీకి ఇది పెద్ద కలంకమని మీనాక్షి నటరాజన్ పై తెలంగాణలో నమోదు కాని కేసును ఆధారంగా తీసుకొని కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్త నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన మహిళ మీనాక్షి నటరాజనుకు ఎదుగుదలను ఓర్వలేక చేసిన ఈ ద్రోహం, కుట్రను మామూలు విషయం కాదని తీవ్రంగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సిబిఐ విచారణ జరిపించి ఈ కుట్రకి పాల్పడ్డ దోషులు ఎవరు తేచాలని ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని బూసిరెడ్డి శంకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ ఎస్సై తిరుపతిరావు



**భద్రాచలం టౌన్, జూన్ 12 ప్రజాజ్యోతి** రోడ్డుపై ప్రయాణించే ప్రతి పౌరుడు రోడ్డు భద్రత నియమాలను పాటస్తూ ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. శుక్రవారం భద్రాచలంలోని యుబి రోడ్ ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఫుట్ పాత్‌ను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు , ఏఎస్ఐ శంకర్ , వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ వినోద్ కుమార్, షమీ పాల్గొన్నారు.

## పోలీస్ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి పొదెం వీరయ్య కి వినతిపత్రం



**భద్రాచలం టౌన్ , జూన్ 12 ప్రజాజ్యోతి** తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామకాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, భద్రాచలం మాజీ శాసనసభ్యులు పొదెం వీరయ్యకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై అభ్యర్థుల వయోపరిమితిని 37 సంవత్సరాలకు పెంచాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 20 వేల పోలీస్ పోస్టులకు సంబంధించి నియామక నోటిఫికేషన్ ను వెంటనే విడుదల చేసేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్నేళ్లుగా నియామకాల ప్రక్రియలో జరిగిన జాప్యంతో అనేక మంది నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. అభ్యర్థులు సమర్పించిన వినతిపత్రాన్ని స్వీకరించిన పొదెం వీరయ్య ,వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై బీఎల్ ఏలకు అవగాహన కార్యక్రమం



**భద్రాచలం టౌన్ , జూన్ 12 ప్రజాజ్యోతి** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం ప్రత్యేక సమావేశం భద్రాచలంలో నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, బీఎల్ఏల బాధ్యతలు, ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, అభ్యంతరాల పరిష్కార విధానాల పై సమగ్ర అవగాహన కల్పించారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నలు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ ఏలు చురుకైన పాత్ర పోషించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని నాయకులు దిశానిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనం కృష్ణ, ఉప సర్పంచ్ రత్నం కవిత, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు తరాల 'మధుర జ్ఞాపకం'

- 'స్మృతి' వేడుకలో 30 కుటుంబాల రాకతో వెల్లివిరిసిన ఆనందం



**బూర్గంపహాడ్, జూన్ 12 (ప్రజా జ్యోతి ):** ఒక తరం కష్టపడి సంపాదిస్తే...మరో తరం కాపాడుతుంది...ఒక తరం పెంచుతుంది...ఒక తరం ముందుకు తీసుకుపోతుంది...ఈ బంధం తెగకుండా చూసుకునే బాధ్యత తరతరాల కుటుంబానిది...నాలుగు తరాలు ఒకేచోట కలిస్తే ఆ దృశ్యం చూడముచ్చటగా ఉంటుంది... అదే మండల పరిధిలోని మోరంపల్లిబంజర్కు చెందిన మార్తి తిరుపతయ్య... రామలక్ష్మి కుటుంబ దృశ్యం శుక్రవారం పాల్వంచ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఓ ఫంక్షన్హాల్లో ఆవిష్కృతమైంది. మార్తి తిరపతయ్య, రామలక్ష్మి దంపతులు కాలం చేసి 30 ఏళ్లు గడిచిపోవడం... ఆ తర్వాత కుమారులు వెంకటేశ్వర్లు, మార్తి నాగయ్యలు కూడా చనిపోవడం... వెంకటేశ్వర్లు 16వ వర్ధంతిని పురస్కరించుకుని... మార్తి తిరుపతయ్య..రామలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థ సమ్మేళనంగా భావించి నాలుగు తరాలకు చెందిన కుటుంబంలో కుమారులు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లు ఇలా మొత్తం 150 మంది స్మృతి సమ్మేళనం నిర్వహించారు. మార్తి నాగరాజు, నాగేంద్రప్రసాద్, జాని, కిస్మత్ రావు, గోతం ముతేష్, ఎనుముల వెంకటేష్లు తరతరాల కుటుంబసభ్యులను ఒక వేదిక మీదకు తీసుకువచ్చేందుకు నిర్వహణ బాధ్యతను తలకెత్తుకుని 30 కుటుంబాల వారంతా ఒక గొడుకు కిందకు వచ్చేలా కష్టపడ్డారు. వర్ధంతి సందర్భంగా అందరూ హాజరనైప్పటికీ నాలుగు తరాలు ఒకేచోట కలిసి చిన్ననాటి స్మృతులు...ముచ్చట్లు చెప్పుకోవడం ఒకింత ఆనందాన్ని కలిగించిందని వారంతా ఉద్వేగంతో పొంగిపోయారు. ఈ వేడుకలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో ఆనందంగా గడిపి సహపంక్తి భోజనం చేయడంతో ఈ వేడుక ముగిసింది.



ఒకవైపు పోలీస్ స్టేషన్ గడప దాటిన సామాన్యుడికి భరోసా కల్పిస్తూ, బాధితుడి సమస్యను తన సమస్యగా భావించే ఫ్రెండ్లీ పోలీసింగ్... మరోవైపు చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే నేరగాళ్లు, రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై ఏమాత్రం రాజీ పడకుండా స్ట్రాంగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అమలు చేస్తూ ఉక్కుపాదం మోపుతున్న పోలీసింగ్. ఈ రెండు భిన్న కోణాలను సమన్వయం చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రత్యేక ముద్ర వేస్తోంది జిల్లా పోలీసు యంత్రాంగం. నేరాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, నేరం జరగకుండా ముందుగానే అడ్డుకోవడమే లక్ష్యంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, వాహన తనిఖీలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు, కమ్యూనిటీ పోలీసింగ్ చర్యలను ముమ్మరం చేసింది. ప్రజల్లో భద్రతాభావనను పెంచుతూ, నేరస్థుల్లో భయాన్ని నింపుతున్న ఈ వినూత్న పోలీసింగ్ విధానం ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసుల పనితీరుపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.

# భరోసా కల్పిస్తూ.. భయం పుట్టిస్తూ...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (ప్రజాజ్యోతి)
( భూక్యా రంజిత్ నాయక్ )

- ప్రజలకు ఫ్రెండ్లీ... నేరగాళ్లకు డెడ్‌లీ
- భద్రాద్రి జిల్లాపై రోహిత్ రాజ్ తనదైన ముద్ర
- ప్రతిరోజూ కార్డన్ అండ్ సెర్చ్‌తో నేరాల నియంత్రణ
- అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్న జిల్లా పోలీసులు
- సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి... ప్రజల్లో అవగాహన
- వాహన తనిఖీలతో నేరస్థుల కదలికలపై నిఘా
- కమ్యూనిటీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ
- ప్రజల్లో భద్రతాభావన పెంచుతున్న ఫ్రెండ్లీ పోలీసింగ్
- నేరం జరగక ముందే అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రత్యేక వ్యూహం
- క్రమశిక్షణ, సాంకేతికత, ప్రజా అనుసంధానంతో ముందుకు పోలీస్ శాఖ
- ప్రజల విశ్వాసమే బలం... శాంతిభద్రతలే ధ్యేయం

పోలీసింగ్ అంటే కేవలం నేరాలు జరిగిన తర్వాత కేసులు నమోదు చేయడం, దర్యాప్తు చేయడం మాత్రమే కాదు. నేరాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవడం, ప్రజల్లో భద్రతాభావన పెంపొందించడం, అసాంఘిక శక్తుల కదలికలను నియంత్రించడం కూడా అంతే కీలకం. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అమలవుతున్న పోలీసింగ్ విధానం ఈ లక్ష్యాల చుట్టూనే తిరుగుతోంది. ప్రజలకు చేరువవుతూ వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తూనే, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన వైఖరిని అవలంబిస్తూ జిల్లా పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది.

### ♦ నేరాల నివారణకే ప్రాధాన్యం

సాంప్రదాయ పోలీసింగ్‌లో నేరం జరిగిన తర్వాత చర్యలు ప్రధానంగా ఉండేవి. అయితే ప్రస్తుతం జిల్లా పోలీసు శాఖ నేరం జరగక ముందే దాన్ని అడ్డుకోవడంపైనే ఎక్కువ దృష్టి సారిస్తోంది. అనుమానాస్పద వ్యక్తులు, నేరచరిత్ర కలిగిన వారిపై నిరంతర నిఘా కొనసాగిస్తూ ముందస్తు చర్యలు చేపడుతోంది. ఈ విధానం నేరాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజల్లో భద్రతాభావనను మరింత పెంచుతోంది.

### ♦ కార్డన్ అండ్ సెర్చ్‌తో కట్టుదిట్టమైన నిఘా

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తరచూ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. గ్రామాలు, కాలనీలు, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికీ తనిఖీలు చేపడుతూ అద్దెదారుల వివరాలు, అనుమానాస్పద కదలికలపై సమాచారం సేకరిస్తున్నారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తుల కార్యకలాపాలను పర్యవేక్షించడంతో పాటు అక్రమ ఆయుధాలు, మాదకద్రవ్యాలు, ఇతర నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి.

### ♦ వాహన తనిఖీలతో అప్రమత్తత

ప్రధాన రహదారులు, కూడళ్లు, చెకపోస్టుల వద్ద నిర్వహిస్తున్న విస్తృత వాహన తనిఖీలు కూడా నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వాహనాల పత్రాలు, ప్రయాణికుల వివరాలను పరిశీలించడం ద్వారా అనుమానాస్పద కదలికలను గుర్తిస్తున్నారు. అక్రమ రవాణా, నేరాలకు ఉపయోగించే వాహనాలపై నిఘా పెంచడం ద్వారా ముందస్తు నియంత్రణ చర్యలు చేపడుతున్నారు.

### ♦ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు చేరువ

పోలీస్ అంటే భయం అనే అభిప్రాయాన్ని తొలగించి, పోలీస్ అంటే నమ్మకం అనే భావనను పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తోంది. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులను గౌరవంగా స్వాగతించడం, వారి సమస్యలను ఓపికగా వినడం, ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో ప్రజలు మరింత నమ్మకంతో పోలీసులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడుతోంది.

### ♦ సైబర్ నేరాలపై ప్రత్యేక పోరాటం

డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, పెట్టుబడుల పేరుతో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, గ్రామ సభలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తోంది.

### ♦ కమ్యూనిటీ పోలీసింగ్‌తో ప్రజల భాగస్వామ్యం

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమనే భావనతో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నారు. స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుంటున్నారు. ప్రజలు–పోలీసుల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి.

### ♦ నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్త వ్యూహం

అటవీ ప్రాంతాలు, సరిహద్దు మండలాలు అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రతా పరంగా ప్రత్యేక వ్యూహం అమలవుతోంది. క్షేత్రస్థాయి సమాచార వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీసులు నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

### ♦ క్రమశిక్షణకు పెద్దపీట

పోలీసు యంత్రాంగంలో క్రమశిక్షణ, బాధ్యతాయుత విధి నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పోలీసు సిబ్బంది పనితీరును నిరంతరం సమీక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. దీని వల్ల పోలీసు శాఖ పనితీరుపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడుతోంది.

### ♦ భద్రాద్రిపై రోహిత్ రాజ్ మార్క్

జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రోహిత్ రాజ్ తనదైన పరిపాలనా శైలితో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే అధికారిగా, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చే నాయకుడిగా, నేరా ల నియంత్రణలో రాజీ లేని అధికారిగా ఆయన వ్యవహరిస్తున్న తీరు జిల్లా పోలీసింగ్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణ, సైబర్ భద్రత, నేరాల నివారణ, ప్రజా అనుసంధానం వంటి అంశాల్లో సమన్వయంతో ముందుకు సాగుతున్న పోలీసు యంత్రాంగం జిల్లాలో భద్ర తా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### ♦ ప్రజలకు భరోసా... నేరగాళ్లకు హెచ్చరిక

"ప్రజల భద్రతే లక్ష్యం... నేరాలకు జిల్లాలో తావులేకుండా చేయడమే ధ్యేయం" అనే సంకల్పంతో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ ముందుకు సాగుతోంది. ప్రజలకు భరోసా కల్పిస్తూ, నేరస్థుల్లో భయం నింపుతూ, ఆధునిక పోలీసింగ్‌కు కొత్త నిర్వచనం ఇస్తున్న ఈ విధానం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతూ, అసాంఘిక శక్తులకు స్పష్టమైన హెచ్చరికగా మారిన ఈ పోలీసింగ్ విధానం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు బలమైన పునాదిగా నిలుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.





## ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల ఎంపికే ముఖ్యం

- బీఎస్పీ సీనియర్ నాయకుడు తడికల శివకుమార్



**చర్ల, జూన్ 12(ప్రజాజ్యోతి):** ఇందిరమ్మ గృహ పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులకు అవకాశం కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సీనియర్ నాయకుడు, లక్ష్మీ కాలనీ గ్రామ పంచాయతీ రెండో వార్డు సభ్యుడు తడికల శివకుమార్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులను భాగస్వాములను చేస్తే నిజమైన అర్హులను గుర్తించడం సులభతరమవుతుందని అన్నారు. గ్రామాల్లోని కుటుంబాల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్థానిక ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన ఉంటుందని పేర్కొన్నారు.ప్రస్తుతం ఎంపిక ప్రక్రియలో అనేక లోపాలు చోటుచేసుకుంటున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అర్హతలు కలిగిన పలువురు పేద కుటుంబాలు ప్రాధాన్య జాబితాల్లో చోటు దక్కక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, కొంత మంది అనర్హులకు ప్రయోజనం కలుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని చెప్పారు.ఇందిరమ్మ గృహ పథకం అసలైన లక్ష్యం పేదలకు సొంత ఇల్లు కల్పించడమేనని, ఆ ఉద్దేశానికి అనుగుణంగా ఎంపిక ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగాలని సూచించారు. గ్రామస్థాయి పాలకవర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటే అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రెండో విడత లబ్ధిదారుల ఎంపికలోనూ అవకతవకలు, పక్షపాత ధోరణులు కనిపిస్తే బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా ఆందోళనలు చేపడతామని తడికల శివకుమార్ హెచ్చరించారు.

## పీడీఎస్ బియ్యం స్వాధీనం

- అక్రమ నిల్వలపై పోలీసుల చర్య – కేసు నమోదు

**దమ్మపేట,జూన్. 12 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం నాయుడుపేట గ్రామానికి చెందిన జింగాల సత్యనారాయణ తన ఇంటి పరిసర ప్రాంతంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు అందిన సమాచారంతో దమ్మపేట పోలీసులు శుక్రవారం ఉదయం తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సందర్భంగా సుమారు 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దమ్మపేట ఎస్ ఐ రాజేష్ మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ చేయడం, కొనుగోలు చేయడం లేదా తరలించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉన్నవారు పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సంబంధిత అధికారులకు అప్పగించి, ఘటనపై మరింత విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి

- ఆర్‌ఎంవోలుగా డాక్టర్ సంతోష్, డాక్టర్ మల్లేష్‌ల నియామకం



**భద్రాచలం టౌన్ , జూన్ 12 ప్రజాజ్యోతి** భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారంనాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వరకు ఆర్‌ఎంవోగా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి వైద్యశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ ముదిగొండ రామకృష్ణ బదిలీపై మణుగూరు వెళ్లడంతో ప్రస్తుతం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం నుంచి పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌గా కొనసాగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వృత్తి పట్ల ఎంతో నిబద్ధతో పని చేసే డాక్టర్ రాజశేఖర్‌రెడ్డికిని సూపరింటెండెంట్‌గా నియమించడం పట్ల ఏరియా వైద్యశాల వైద్యులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల వైద్య నిపుణుడిగా బాధ్యతలు నిర్వహించే డాక్టర్ రాజశేఖర్ రెడ్డి కీలకమైన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించడం వలన వైద్యశాలలో ఎస్ఎన్‌సీయుతో పాటు ఇతర వైద్య విభాగాలను మరింతగా అభివృద్ధి చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. అదేవిధంగా వైద్యశాల ఆర్‌ఎంవోలుగా డాక్టర్ సతోంసంతోష్‌డాక్టర్ మల్లేష్‌లను నియమించారు.

# ఉప్పేరులో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

- 110 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ
- ఏజెన్సీలో సింధు హాస్పిటల్ వైద్య సేవలు అభినందనీయం
- పంచాయతీ కార్యదర్శి యు గంగాధర్





**కుక్కునూరు, జూన్ 12 ప్రజాజ్యోతి** ఏజెన్సీ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా భద్రాచలానికి చెందిన సింధు హాస్పిటల్ ఆధ్వర్యంలో కుక్కునూరు మండలం ఉప్పేరు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన 'ఉచిత మెగా వైద్య శిబిరం' విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి యు. గంగాధర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాలలోని పేద ప్రజల కోసం ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ, మందులను పంపిణీ చేయడం అభినందనీయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఏజెన్సీలో పేద ప్రజల కోసం ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ పోతరాజు ప్రశాంత్ శిబిరంలో పాల్గొన్న సింధు హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పోతరాజు ప్రశాంత్ మాట్లాడుతూ.. "తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో భద్రాచలంలో సింధు హాస్పిటల్‌ను ప్రారంభించాం. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా షుగర్, బీపీ ఉన్న వారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలు పాటించాలి" అని సూచించారు.రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ఈ శిబిరంలో సుమారు 110 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యేసు బాబు, రమేష్, జనసేన నాయకులు కోటి, సందీప్, నవీన్, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కొప్పుల మురళి,హాస్పిటల్ సిబ్బంది నాగేంద్ర, కీర్తన, శృతి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్పందించిన పంచాయతీ పాలకవర్గం... పరిష్కారమైన నీటి నిల్వ సమస్య

- సిమెంట్ రోడ్డుపై నీరు నిలవకుండా చర్యలు
- పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న గ్రామ ప్రజలు





**అన్నపురెడ్డిపల్లి, జూన్ 12 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ సమీపంలోని సిమెంట్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గ్రామ ప్రజలు పాలకవర్గ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన గ్రామ సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉపసర్పంచ్ మారగాని అశోక్ దగ్ గరుండి పనులను పర్యవేక్షిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.రోడ్డుపై నిలిచిన నీరు సులభంగా బయటకు వెళ్లే విధంగా మట్టి పోసి రహదారిని సమతలీకరించారు. అలాగే నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించి, నిల్వ నీరు వేరే వైపు వెళ్లేలా మార్గం కల్పించారు. దీంతో గత కొన్ని రోజులుగా ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోయాయని స్థానికులు తెలిపారు.ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉపసర్పం చ్ మారగాని అశోక్‌తో పాటు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులందరినీ గ్రామ ప్రజలు అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇదే చొరవ కొనసాగించాలని కోరారు.

## అక్రిడేషన్‌లతో ఆనందం.. ఆత్మీయ కలయికతో ఉత్సాహం

- భద్రాచలంలో ప్రజా జ్యోతి రిపోర్టర్ల సమావేశం



**భద్రాచలం, జూన్ 12 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజా జ్యోతి దినపత్రిక రిపోర్టర్ల ఆత్మీయ కలయిక కార్యక్రమం శుక్రవారం భద్రాచల పట్టణంలోని రెడ్డి సత్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రజా జ్యోతి ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. కార్యక్రమానికి ముందు పాత్రికేయులు భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెడ్డి సత్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజా జ్యోతి బ్యూరో ఇన్‌చార్జ్ భూక్యా రంజిత్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ప్రజా జ్యోతి దినపత్రిక సీఈవో భిక్షా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దినపత్రిక అభివృద్ధి, వార్తల నాణ్యత, పాత్రికేయుల బాధ్యతలు, ప్రజా సమస్యల ప్రతిబింబం, డిజిటల్ యుగంలో జర్నలిజం పాత్ర వంటి పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ఇటీవల ప్రజా జ్యోతి దినపత్రికకు కేటాయించబడిన జర్నలిస్టు అక్రిడేషన్ కార్డులను సంబంధిత ప్రతినిధులకు భిక్షా రెడ్డి, భూక్యా రంజిత్ నాయక్ సంయుక్తంగా అందజేశారు. అక్రిడేషన్ కార్డులు అందుకున్న పాత్రికేయులను వారు అభినందిస్తూ మరింత బాధ్యతాయుతంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ అప్పారావు, ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాధాకృష్ణ, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోలా కుమార్, పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్, అలాగే జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన ప్రజా జ్యోతి దినపత్రిక పాత్రికేయులు అదేవిధంగా ఇండియన్ క్రానికల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్ క్రాంతి కుమార్ దాసరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పామాయిల్ తోటలో గెలల చోరీ.. కేసు నమోదు

**దమ్మపేట,జూన్. 12 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన జూపల్లి రమేష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేశారు. గత కొంతకాలంగా కొర్స వెంకటేశు, మహే ష్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు తన పామాయిల్ తోటలోకి అక్రమంగా ప్రవేశించి నీటి పైపులను ధ్వంసం చేశారని, అలాగే తనకు చెందిన పామాయిల్ గెలలను దొంగతనంగా తీసుకెళ్లారని రమేష్ ఫిర్యాదులో పేర్కొన్నారు.బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఆరోపణలపై విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.